సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌

శంషాబాద్‌: మున్సిపాలిటీలోని వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు శనివారం రాజేంద్రనగర్‌ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్‌ చెక్కులు అందజేశారు. పేదలకు సీఎంఆర్‌ఎఫ్‌ ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పిస్తోందని ప్రకాష్‌గౌడ్‌ అన్నారు. ప్రభుత్వ అర్హులైన వారికి సీఎంఆర్‌ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ సుష్మ, వైస్‌చైర్మన్‌ గోపాల్‌, నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్‌ వెంకటేష్‌గౌడ్‌, కౌన్సిలర్లు కుమార్‌, మేకల వెంకటేష్‌, విజయలక్ష్మీ, లావణ్య, నాయకులు మురళి, శ్రీనివాస్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

జన్మదిన శుభాకాంక్షలు



రాజేంద్రనగర్‌: గట్టు రామచంద్రరావు జన్మదినం సందర్భంగా శనివారం బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు సదాల శ్రీనివాస్‌ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ఉద్యోగం పేరిట మోసం

శంషాబాద్‌: శంషాబాద్‌ విమానాశ్రయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో నివాసముంటున్న కాశీనాథ్‌ అనే వ్యక్తి ఎయిర్‌పోర్టులో ఓ కాంట్రాక్టు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన పరిచయాల ద్వారా ఉద్యోగాల్లో పెట్టిస్తానని నలుగురు యువకుల నుంచి యాభై వేలు, డెబ్బైవేల చొప్పున తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా మాట దాటవేస్తుండడంపై అతడిని బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్‌ కార్మికుడి ఆత్మహత్య



యాదయ్య (ఫైల్‌)

మణికొండ: అనారోగ్య సమస్యలు, భార్యాభర్తల మధ్య వాదులాటతో మణికొండ మున్సిపాలిటీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న యాదయ్య (48) ఆత్మహత్య చేసుకున్నాడు. శివాజీనగర్‌ కాలనీలో నివాసముంటున్న యాదయ్యకు ఇటీవలే జాండీస్‌ రావటంతో మద్యం తాగవద్దని తన భార్య పలుమార్లు చెప్పింది. ఈ విషయంగానే శనివారం ఉదయం భార్య గొడవపడి అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లగా, ఇద్దరు పిల్లలు కళాశాలలకు వెళ్లారు. తీవ్ర మనస్తాపానికి గురైన యాదయ్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తమ్ముడు చూసి వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనం ఢీకొని కార్మికురాలికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న సరస్వతి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికురాలికి బైకు ఢీకొట్టడంతో కోమాలోకి వెళ్లింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. గగన్‌ పహాడ్‌ ప్రాంతానికి చెందిన సరస్వతి శనివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో మైలార్‌దేవ్‌పల్లిలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు హాజరు వేసుకొని విధులు నిర్వహిస్తుంది. రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సరస్వతిని ఓ బైకు దుర్గానగర్‌ నుంచి పల్లెచెరువుకు వెళ్లే మార్గంలో వేగంగా వచ్చిన ఢీకొట్టింది. దీంతో బాధితురాలిని స్థానికులు, తోటి కార్మికులు ప్రైవేట్‌ ఆసుపత్రికి తలించారు. మున్సిపల్‌ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఆనంద్‌, ఏరాజులు బాధితురాలిని పరామర్శించారు. పారిశుద్ధ కార్మికుల పట్ల సర్కిల్‌ అధికారులు శ్రద్ధ వహించాలని కోరారు.

ట్యూషన్‌ నుంచి ఇంటికి వస్తుండగా...

అత్తాపూర్‌: ఓ బాలుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఘటన అత్తాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ రషీద్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎం పహాడి షరీఫ్‌ గార్డెన్స్‌ ప్రాంతంలో నివాసముంటున్న షేక్‌ మహబూబ్‌ కుమారుడు షేక్‌ మహబూబ్‌ మన్సూర్‌(6) స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల విద్యతో పాటు అరబిక్‌ నేర్చుకునేందుకు సమీపంలో ఉన్న ట్యూషన్‌ మాస్టర్‌ వద్ద అరబిక్‌ భాష నేర్చుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ట్యూషన్‌ నుంచి ఇంటికి వస్తున్న మహబూబ్‌ మన్సూర్‌ను గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాబును చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం కూచిపూడి, భరతనాట్యం, మోహినియట్టం నృత్య ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ధనీషా ధనపాల్‌ మోహినియట్టం , ఆషిక షణ్ముగం భరతనాట్య ప్రదర్శన అర్చన గుత్తి శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో బ్రహ్మాంజలి, అదివో అల్లదివో, శివ పంచాక్షరీ కృష్ణ జనన శబ్దం తదితర అంశాలను అర్చన, సహస్ర, వైష్ణవి, సాయిశ్రీ, మానస, శ్రీహిత, కీర్తన, సింధూర, హైందవి, పర్ణిక, సుదీక్ష, వినూత్న, శాన్వి, హారిణి, వర్ష ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు నిర్మలా ప్రభాకర్‌, గుదిబండి వెంకట్‌రెడ్డి పాల్గొని కళాకారులను అభినందించారు.

ఎస్కీ.. ఎవర్‌ గ్రీన్‌



2024లో సాధించిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు, మెమెంటో స్వీకరిస్తున్న ఎస్కీ డైరెక్టర్‌ డాక్టర్‌ జి రామేశ్వరరావు

ఈ ఏడాది ఒకేసారి 4 ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు, గ్రీన్‌ అవార్డు

అత్యున్నత శిక్షణా కార్యక్రమాలు, ఉన్నత విద్యా కోర్సుల నిర్వహణలో గచ్చిబౌలి ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా (ఎస్కీ) జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. 'ఎస్కీ' చరిత్రలో 2024 సంవత్సరం అతి ముఖ్యమైన సంవత్సరంగా చెప్పక తప్పదు. ఈ సంస్థ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ ఇంజనీర్స్‌ ద్వారా ఏర్పాటు చేయబడిన స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థ. ఈ సంస్థ పనితీరు, శిక్షణా కార్యక్రమాలకు గోల్డెన్‌ పికాక్‌ అవార్డులు లభించాయి. 1981లో గచ్చిబౌలిలో 70 ఎకరాల స్థలంలో ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియాను స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగా ఏర్పాటు చేశారు. ఇది కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు, ఇంజనీర్లకు ఏడాది పొడవునా 350కి తగ్గకుండా శిక్షణలు ఇవ్వడమే కాకుండా ఇంజనీరింగ్‌, మేనేజ్‌మెంట్‌ రంగాలలో రెండేళ్లు, ఏడాది కాలం స్వల్పకాలిక కోర్సులను కూడా అందిస్తోంది.

– రాయదుర్గం



గ్రీన్‌ అండ్‌ ఎన్విరాన్‌మెంట్‌ అవార్డు సర్టిఫికెట్‌, ఎస్కీ 2024లో సాధించిన ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు

- 2021, 22 ,23, 24లలో వరుసగా అవార్డులు
- 'గోల్డెన్‌ పికాక్‌ అవార్డు'తో దేశంలోనే 'ఎస్కీ' రికార్డు
- 'ఎస్కీ'కి ఇప్పటి వరకు 9 గోల్డెన్‌ పికాక్‌ అవార్డులు



- ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియాకు 2024 సంవత్సరం ఎంతో ముఖ్యమైనదిగా చెప్పవచ్చు. జూలై 12న హెచ్‌వైఎం ఇంటర్నేషనల్‌ సర్టిఫికేషన్స్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ ద్వారా ఐఎస్‌ఓ సర్టిఫికెట్లు ఒకేరోజు నాలుగింటిని పొందడం విశేషం.
- పరిపాలనా వ్యవహారాలు, డాక్యుమెంటేషన్‌ విధానాలు, ఉద్యోగులు తమ విధి విధానాలను పాటించడం, సమయపాలన, ఫైళ్ల సత్వర పరిష్కారం వంటి అద్భుతమైన విధానాలను అమలు చేసినందుకు ఐఎస్‌ఓ 9001 క్వాలిటీ మేనేజ్‌మెంట్‌ సర్టిఫికెట్‌ను అందించారు.
- ఎస్కీ ప్రాంగణంలో ఉన్న భారీ బండరాళ్లు, భారీ వృక్షాలతో సహజదనం ఉట్టిపడుతుండగా, గ్రీనరీ పెంపుదలకు ప్రత్యేక కృషి చేయడంతో ఐఎస్‌ఓ 14001 ఎన్విరాన్‌మెంట్‌ మేనేజ్‌మెంట్‌ సర్టిఫికెట్‌ లభించింది.
- ఉద్యోగులు, అధికారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవడం, తరచూ వైద్య పరీక్షల నిర్వహణ, చైల్డ్‌ లేబర్‌ లేకపోవడం, షిఫ్టుల వారీగా సిబ్బందికి పని వేళలు ఏర్పాటు చేయడంతో ఐఎస్‌ఓ 45001 ఆక్యుపేషనల్‌ హెల్త్‌ సేఫ్టీ మేనేజ్‌మెంట్‌ సర్టిఫికెట్‌ను అందుకున్నారు.
- క్యాంపస్‌లో సోలార్‌ విద్యుత్‌ను వినియోగించడం, కార్యాలయం మొత్తం ఎల్‌ఈడీ దీపాలు వాడటంతో ఐఎస్‌ఓ 50001 ఎనర్జీ మేనేజ్‌మెంట్‌ సర్టిఫికేషన్‌ కూడా అందించారు.

గ్రీన్‌ అండ్‌ ఎన్విరాన్‌మెంట్‌ -2024 అవార్డు

- ప్రభుత్వం ఆశించే అన్ని రకాల స్థాయిలను 'ఎస్కీ 8 పాటిస్తున్నందున నగరానికి చెందిన హెచ్‌వైఎం ఇంటర్నేషనల్‌ సర్టిఫికేషన్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ సంస్థ గ్రీన్‌ అండ్‌ ఎన్విరాన్‌మెంట్‌ అవార్డు-2024'ను కూడా అందుకుంది.

'గోల్డెన్‌ పికాక్‌ అవార్డు'.. గత నాలుగేళ్లుగా 9 అవార్డులు



- శిక్షణా కార్యక్రమాల నిర్వహణ, పనితీరును గుర్తించి గోల్డెన్‌ పికాక్‌ అవార్డు అందజేశారు.
- 'ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డైరెక్టర్స్‌ ఇండియా' ద్వారా ఈ అవార్డులను అందిస్తారు. 2023, 2024 అవార్డులను దుబాయిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 'ఎస్కీ'కి అందించడం విశేషం.
- ఎస్కీకి గోల్డెన్‌ పికాక్‌ అవార్డు 2007, 2008 ,2010, 2011, 2012, 2021 ,2022 ,2023, 2024లో పొందడం విశేషం.

మరింత గుర్తింపు వచ్చేలా కృషి



'ఎస్కీ' సంస్థలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమష్టి కృషి, పని తీరుకు అవార్డు రావడమే నిదర్శనం.నా హయాంలో వరుసగా నాల్గవ ఏడాది కూడా గోల్డెన్‌ పికాక్‌ అవార్డును స్వీకరించడం ఎంతో గర్వంగా ఉంది. ఇప్పటి వరకు ఎస్కీ 9 గోల్డెన్‌ పికాక్‌ అవార్డులను పొందగలిగింది. రాబోయే రోజుల్లో 'ఎస్కీ'ని మరింతగా అభివృద్ధి చేస్తాం. 9 అవార్డులు రావడంతో మా బాధ్యత మరింత పెరిగింది.

– డా.రామేశ్వరరావు, డైరెక్టర్‌ ఇంజనీరింగ్‌ స్టాఫ్‌ కాలేజ్‌ ఆఫ్‌ ఇండియా

ఘనస్వాగతం పలికేందుకు తరలిరావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆడమాటి సుబ్బారావు మాదిగ

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపాల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ఆరెమైసమ్మ దేవాలయం ఆవరణలో గండిపేట మండల ఎమ్మార్పీఎస్‌ ఇన్‌ఛార్జీ పుట్లగారి గణేష్‌మాదిగ ఆధ్వర్యంలో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్‌ రాజేంద్రనగర్‌ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఆడమాటి సుబ్బారావుమాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 13న అభినవ అంబేద్కర్‌, ఆరోగ్య శ్రీ దాత, వృద్ధులు, వితంతువుల ఆపద్బాంధవుడు మందకృష్ణమాదిగ మాదిగల 30 ఏళ్ల కల ఏబీసీడీ వర్గీకరణను సుప్రీంకోర్టులో విజయవంతం చేసుకుని తిరిగి వస్తున్నారన్నారు. శంషాబాద్‌ ఎయిర్‌పోర్టులో ఘనంగా స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలన్నారు. మండలం, గ్రామంలోని వివిధ రాజకీయంలో ఉన్న మాదిగ సంఘాల నాయకులు విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు మదిలేటి మాదిగ, రాష్ట్ర నాయకులు శంకర్‌రావు మాదిగ, ఎంఈఎఫ్‌ పోతరాజు మాదిగ, వెంకటేష్‌ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

అత్తాపూర్‌: అత్తాపూర్‌ డివిజన్‌ కార్యవర్గ సమావేశం శనివారం డివిజన్‌ అధ్యక్షులు సాబాద విజయ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు శ్రీరాం నగర్‌ సర్పంచ్‌, సీనియర్‌ నాయకులు ఎస్‌. ప్రభాకర్‌ రెడ్డి, చేవెళ్ల బీజేపీ పార్లమెంట్‌ కన్వీనర్‌ నారగూడం మల్లారెడ్డిలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేయడం జరిగింది. ఇందులో భాగంగా హర్‌ ఘర్‌ తిరంగా అభియాన్‌ కార్యక్రమం స్వతంత్ర సమరయోధుల విగ్రహాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలు యువమోర్చ ఆధ్వర్యంలో తిరంగా స్కూటీ ర్యాలీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్‌ అసెంబ్లీ కన్వీనర్‌ మల్లేష్‌ యాదవ్‌, రాజశేఖర్‌, జయానంద్‌రెడ్డి, కిరణ్‌, వెంకటేష్‌, గాయత్రి, రాజశ్రీ బాల కృష్ణ, సతీష్‌కుమార్‌, రాము, శశికాంత్‌ శర్మ తదితరులు పాల్గొన్నారు.

వీసీకి పుస్తకం అందజేత

రాయదుర్గం: హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ పొలిటికల్‌ సైన్స్‌ సీనియర్‌ ప్రొఫెసర్‌ రాందాస్‌ రూపావత్‌ రచించిన తెలంగాణ రాజకీయ ప్రస్థానం–సామాజిక ఆర్థిక విశ్లేషణ' పుస్తకాన్ని వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ బీజేరావుకు శనివారం అందించారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లోని పరిపాలనా భవనంలో వీసీ కార్యాలయంలో ఆయనను కలిసి ఈ పుస్తకాన్ని అందించారు. ఈ సందర్భంగా రాందాస్‌ మాట్లాడుతూ 1953 నుంచి 2024 వరకు తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక అంశాలను పుస్తకంలో పొందపర్చడం జరిగిందన్నారు. ఈ పుస్తకం సివిల్‌ సర్వీసెస్‌ పరీక్షలు, గ్రూప్‌–1 రాసే వారికి ఉపయుక్తం అని ఆయన స్పష్టం చేశారు.

నేడు ఉచిత కేన్సర్‌ స్క్రీనింగ్‌ వైద్య శిబిరం

మాదాపూర్‌: మారిన జీవనశైలి, వివిధ రకాల ఆహారపు అలవాట్ల వల్ల చాలా మంది కేన్సర్‌ బారిన పడుతున్నారు. ఈ క్రమంలో మెడికవర్‌ కేన్సర్‌ ఇనిస్టిట్యూట్‌లో ఆదివారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఉచిత కన్సల్టేషన్‌ అందిస్తున్నారు. మరిన్ని వివరాలకు ఫోన్‌ 9154316236, 040 68334455లలో సంప్రదించగలరు.

సంకీర్తనార్చన



మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం వైష్ణవి గోపరాజు సంకీర్తనార్చన చేశారు. దేవదేవంభజే, రామచంద్రుడితడు, తలచినవన్నియు, తిరోతిరో, రాజీవనేత్రాయ, నారాయణనమో, గోవిందాశ్రిత గోకుల, నగవులు నిజమని, శరణు కీర్తనలు ఆలపించారు. కీబోర్డు గురుప్రసాద్‌, మృదంగం రామకృష్ణ, వాయిద్య సహకారాన్ని అందించారు. డాక్టర్‌ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలను అందజేశారు.

యోగా పోటీలలో రాణించిన హెచ్‌సీయూ విద్యార్థులు

రాయదుర్గం: యోగా జిల్లా స్థాయి పోటీలలో గచ్చిబౌలి హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ క్యాంపస్‌ స్కూల్‌ విద్యార్థులు సత్తా చాటారు. శనివారం హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో ప్రిన్సిపల్‌ పి మురళి విద్యార్థులను అభినందించారు. రంగారెడ్డిజిల్లా స్థాయి పోటీలకు ఈ క్యాంపస్‌ స్కూల్‌ విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో సబ్‌ జూనియర్‌ కేటగిరిలో క్యాంపస్‌ స్కూల్‌ నుంచి ఆరు మంది విద్యార్థులు పాల్గొనగా వైష్ణవి ద్వితీయ స్థానంతో వెండి పతకం, చందనకు తృతీయ స్థానం కాంస్య పతకం సాధించారు. వారిద్దరు సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనున్నారు.

ఘనంగా వైస్‌ చైర్మన్‌ జన్మదిన వేడుకలు



శుభాకాంక్షలు తెలిపిన బీజేపీ నాయకులు

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ వైస్‌ చైర్మన్‌, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె. నరేందర్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన నివాసంలో అభిమానులు, తోటి కౌన్సిలర్‌లు, బీజేపీ నాయకులు, కాంగ్రెస్‌ నాయకులు ఘనంగా వేడుకలు జరుపుకున్నారు. అనంతరం మర్రి చెట్టు సర్కిల్‌ వద్ద పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌ కుమార్‌గౌడ్‌, బీజేపీ మున్సిపల్‌ అధ్యక్షుడు బీరప్ప, కౌన్సిలర్‌ రామకృష్ణారెడ్డి, నాయకులు శ్రీరాములు, మాల్యాద్రినాయుడు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకలు తెలిపిన కాంగ్రెస్‌ నాయకులు

కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక పాలపై పోరాడాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని

శంషాబాద్‌: రంగారెడ్డి జిల్లా నిర్మాణ మండలి సమావేశానికి శనివారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ సర్కారు పేదలను దోచి పెద్దలకు పెడుతుందని మండిపడ్డారు. కార్పొరేట్‌ సంస్థలకు మోకరిల్లుతున్న కేంద్ర సర్కారు కార్మికుల హక్కులను మాత్రం కాలరాస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జంగయ్య, మండల కార్యదర్శి నర్రగిరి తదితరులు పాల్గొన్నారు.

ఆవుకు చికిత్సలందించిన గోరక్షక్‌ సభ్యులు



ఆవును చికిత్స నిమిత్తం తరలిస్తున్న గోరక్షక్‌ సభ్యులు



ఆవుకు వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

రాజేంద్రనగర్‌: రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి తీవ్ర గాయాలకు గురైన ఓ గోవును గోరక్షక్‌ సభ్యులు రాజేంద్రనగర్‌ పోలీసుల సహాయంతో గోశాలకు తరలించారు. కాళి మందిర్‌ ప్రధాన రహదారిపై ఓ వాహనం రోడ్డుపై ఉన్న గోవును ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వాహనం బలంగా ఢీకొనడంతో గోవు కాలు విరిగి అక్కడే కుప్పకూలింది. అది గమనించిన గోరక్షక్‌ సభ్యులు మల్లేష్‌ యాదవ్‌ గోవు పరిస్థితిని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోరక్షక్‌ సభ్యులు మల్లేష్‌ యాదవ్‌, సురేశ్‌తో పాటు మరికొందరి సహాయంతో గోవును అత్తాపూర్‌లోని గోశాలకు తరలించారు. అక్కడి వెటర్నరీ వైద్యులు గోవుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం గోవు కోలుకుంటుందని మల్లేష్‌ యాదవ్‌ తెలిపారు. రోడ్డుపై గోవులు ఉన్న సమయంలో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

రోడ్లన్నీ గుంతలమయం



వర్షపునీరుతో నిండిపోయిన గుంతలు

అత్తాపూర్‌: అత్తాపూర్‌ పీవీ నరసింహారావు ఎలివేటెడ్‌ ఎక్స్‌ప్రెస్‌వేలో పిల్లర్‌-119 నుంచి 122 పిల్లర్‌ వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 122 పిల్లర్‌ ప్రధాన రహదారిలో మోకాలిలోతు గుంతలు ఏర్పడ్డాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో వేలాదిమంది ప్రయాణికులు, వాహనదారులు, పాదాచారులు ప్రయాణిస్తుంటారు. వర్షపునీరు నిలవడంతో ఆ గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు, స్థానికులు ఆ గుంతల్లో పడి ప్రమాదాల భారీన పడుతున్నారు. ఈ రహదారి గుండానే ఇసుక డంపింగ్‌ యార్డు నుంచి ఇసుక, కంకర, ఇటుక తరలించేందుకు భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సర్వీస్‌ రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తున్న ప్రభుత్వ యంత్రాంగం వెంటనే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

